ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.2 , కనిష్ఠం 26.8



నిర్మల్
జిల్లా వార్తలు

8

శనివారం 3 మే 2025

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

తానూర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రావడం లేదని మహాలింగి గ్రామానికి చెందిన రవికిరణ్ (34) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మృతుడు రవికరణ్‌కు ఏడేళ్ల క్రితం సరస్వతీ నగర్‌కు చెందిన జ్యోతితో వివాహం అయింది. అయితే వారికి సంతానం కాకపోవడంతో భార్య జ్యోతి సంవత్సరం క్రితం పుట్టింటికి వెళ్లి పోయింది. దీంతో మద్యానికి బానిసయిన రవికిరణ్ ఒంటరి జీవితంలో మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సుభాష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రెయినీ ఎస్సై తెలిపారు.

31వ తేదీ వరకు జిల్లా అంతటా 30 పోలీసుయాక్ట్ అమలు

జిల్లా ఎస్పీ డా. జి. జానకీషర్మిల



నిర్మల్ అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శాంతిభద్రత దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందిం చేందుకు మే 1 నుంచి మే 31 వరకు జిల్లా అంతటా 30 పోలీసుయాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా. జి. జానకీషర్మిల ఐపీఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీసుయాక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదు. నిషేధిత ఆయుధాలు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, ప్రేలుడు పదా ర్థాలు, నేరాలకు పురిగొల్పే ఎటువంటి ఆయుధాలను వాడరాదు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగిం చేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లను, జన సమూహం వంటి నిషేధం. రాళ్లను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధం. లౌడ్‌స్పీకర్లు, డీజేలు వంటి కూడా ఈ సమయంలో నిషేధం. నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీసుయాక్ట్ 1861 కింద శిక్షార్హులు అవుతారని ఎస్పీ పేర్కొన్నారు.

కీసరలో ఈఓ.. బాసరలో పాలన



- నెలల తరబడి భర్తీ కాని బాసర ఆలయ ఈఓ పోస్టు
- దీర్ఘకాల సెలవులో ఏఈఓ
- రెండు సూపరింటెండెంట్ పోస్టుల్లో ఒకటి ఖాళీ
- భారమంతా ఒక్క సూపరింటెండెంట్‌పైనే..
- అమ్మవారి ఆలయంపై దేవాదాయ శాఖ అంతులేని నిర్లక్ష్యం
- అసౌకర్యాలతో భక్తులకు తప్పని కష్టాలు
- కన్నెత్తి చూడని అధికారులు



బాసర, మే 2 (ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో జిల్లాలోని బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం ఒక్కటి. అరుదైన రెండు సరస్వతీ దేవాలయాల్లో ఒక్కటి కాశ్మీర్ లోయలో ఉంటే.. రెండోది బాసరలో ఉంది. ఇలా ఈ క్షేత్రానికి ఎంతో ప్రాశస్త్యం ఉన్నప్పటికీ.. అడుగడుగునా నిర్లక్ష్యానికి గురవుతోంది. ఆదాయ పరంగా దేవాదాయ శాఖలో బాసర దేవస్థానానికి రీజినల్ జాయింట్ కమిషనర్ స్థాయి అధికారి ఈఓగా ఉండాల్సి ఉంది. కానీ కొన్ని రోజులుగా అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారిని నియమిస్తూ వస్తున్నారు.అది కూడా పూర్తిస్థాయిలో కాకుండా.. ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు కలిగి ఉన్న అధికారిని పంపిస్తున్నారు. ఫలితంగా అసలే సౌకర్యాలేమితో ఇబ్బందులు పడుతున్న భక్తులకు ఇది మరింత శాపంగా మారుతోంది. తాగడానికి కనీసం నీరు అందించలేని దుస్థితిలో దేవస్థానం ఉంది. భక్తుల నుంచి రూ.కోట్లల్లో ఆదాయం వస్తున్నా.. ఆలయంలో కనీస వసతులు కరవుతున్నాయి. బాసర పరిస్థితిపై ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. రెగ్యులర్ ఈఓను నియమించాలని కోరారు.

● వచ్చేందుకు ఆసక్తి చూపని అధికారులు

బాసరపై దేవాదాయ శాఖ నిర్లక్ష్యమే ఇందుకు కారణమవుతోంది. ఇక్కడ రెగ్యులర్ ఈఓగా పనిచేస్తున్న విజయరామారావును తొలగించి నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్‌గా పంపింది. మళ్లీ విజయ రామారావుకే బాసర ఆలయ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలను అప్పగించింది. ఇలా ఉన్న ఈఓను తీసేసిన దేవాదాయ శాఖ.. మళ్లీ ఆయన్నే ఇన్‌చార్జిగా నియమించడం విమర్శలకు తావిచ్చింది. ఆ తర్వాత దీర్ఘకాల సెలవు పెట్టడంతో విజయ రామారావు స్థానంలో ఆదిలాబాద్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న నవీన్‌కు బాసర ఆలయ అదనపు బాధ్యతలను అప్పగించారు. రెండు నెలలు పనిచేసిన ఆయన.. ఇక్కడ ఆలయంలో పరిస్థితులు నచ్చక వెంటనే తప్పుకున్నారు. ఫిబ్రవరిలో ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న సుధాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈయన కీసర రామలింగేశ్వర స్వామి దేవస్థాన రెగ్యులర్ ఈఓగా కొనసాగుతున్నారు. 200 కిలో మీటర్ల దూరంలో ఉన్న బాసరకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంతో సుధాకర్ రెడ్డి బాసరకు సరైన న్యాయం చేయలేకపోతున్నారు. నెలలో ఒక్కటి రెండు సార్లు తప్ప.. బాసరకు ఎక్కువ రోజులు కేటాయించలేకపోతున్నారు. కీసరా అసిస్టెంట్ కమిషనర్ స్థాయి ఆలయమైతే.. బాసర ఆర్‌జేసీ దేవస్థానం. ప్రస్తుతం ఇన్‌చార్జిగా సుధాకర్ రెడ్డి కూడా బాసరలో పరిస్థితి నచ్చక.. తనను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను వేడుకుంటున్నట్టు సమాచారం.

● బాసరపై దేవాదాయ శాఖ చిన్నచూపు

బాసర ఆలయ ఈఓగా పనిచేసేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. గత కొన్నేళ్ల క్రితం నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. కొందరి తీరుతో నిత్యం తరచూ వివాస్పదమవుతూ వార్తల్లో ఉండడం.. ఆలయంలో అంతర్గత వర్గపోరు కారణంగా ఇక్కడ పనిచేసే వారికి తలనొప్పిగా మారింది. చివరకు బాసర అంటే దేవాదాయ శాఖలో భయపడే స్థాయికి చేరింది. అందుకే ఎవరు కూడా బాసర ఆలయ ఈఓగా పనిచేయడానికి ఆసక్తి చూపడం లేదు. అందుకే గత పదేళ్లలో కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే రెగ్యులర్ ఈఓగా ఉండగా.. మిగతా కాలం అంతా ఇన్‌చార్జిల పాలనతో కొనసాగింది. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లాకు చెందిన వ్యక్తి దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేసినా.. బాసరలో ఏళ్ల తరబడి ఇన్‌చార్జి అధికారుల పాలనలో కొనసాగింది. సమైక్య రాష్ట్రంలో కూడా ఇలాంటి పరిస్థితి ఏర్పడలేదు. కానీ ప్రత్యేక రాష్ట్రంలో బాసర పుణ్యక్షేత్రం అభివృద్ధి పరంగా.. ఇలా అధికారుల నియామకంలో రోజురోజుకూ వెనకబడిపోతోంది. మొత్తానికి రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ఒక్కటైన బాసరకు రెగ్యులర్ ఈఓను నియమించడంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

● పడిపోతున్న ఆదాయం.. పెరుగుతున్న అవినీతి

రెగ్యులర్ అధికారులు లేక బాసరలో పరిపాలన పూర్తి స్థాయిలో గాడి తప్పిందని చెప్పొచ్చు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చే భక్తులు సరైన మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పర్యవేక్షణ నిఘా లేక ఆలయంలో అవినీతి పెరిగిపోయింది. ఎందెందు వెదికినా ఏముంది.. అన్నట్టు ప్రతీ విభాగంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. సాక్షాత్తూ దేవాదాయ శాఖ విచారణలో తేలినప్పటికీ.. ఇక్కడి రాజకీయ నాయకుల ప్రభావంతో అక్రమార్కుల ఆగడాలు కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయానికి రావాల్సిన ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లిపోతోంది. ఒకప్పుడు ఆదాయ పరంగా రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉన్న బాసర దేవస్థానం అవినీతి కారణంగా మరింత దిగజారిపోయింది. అది కాస్త ప్రస్తుతం 8,9 వ స్థానానికి పడిపోయింది.ఇందుకు రెగ్యులర్ ఈఓ లేకపోవడం,అవినీతి పెరగడమే కారణమని స్పష్టమవుతోంది.

● రెవెన్యూ అధికారి కోసం ప్రభుత్వానికి లేఖ

దేవాదాయశాఖలో బాసర ఆలయ ఈఓగా పనిచేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ఉన్నత అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు. రెవెన్యూ శాఖ నుంచి ఆర్డీవో స్థాయి అధికారిని బాసర ఆలయ ఈఓగా నియామించాలని కోరుతూ దేవాదాయ శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు బాసర ఆలయ వర్గాలు పేర్కొంటున్నాయి. రెవెన్యూ శాఖ పరిపాలనపై పట్టు సాధించి భక్తులకు సమస్యలు లేకుండా ఉంటుందని ఉన్నతాధికారులు బావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో బాసరకు రెగ్యులర్ అధికారి ఎప్పుడు నియామకం జరుగుతుందో వేచి చూడాల్సిందే..!!

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

కుబీర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంజిని గ్రామంలో శుక్రవారం మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ నిధులు రూ.35 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆలయంలో భక్తిశ్రద్ధలతో, మహిళలు మంగళహారతులతో గ్రామంలోని విధుల గుండా శోభాయాత్ర నిర్వహిస్తూ ఆలయానికి చేరుకొని శాంతియాగం, గణపతిపూజ తదితర పూజలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావుపాటిల్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు విఠల్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కుబీర్ మాజీ ఏఎంసీ చైర్మన్ కందూర్ సంతోష్, నాయకులు విజయ్‌కుమార్, చవాన్ శంకర్, అనిల్, మహేందర్, భూషణ్, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సారంగాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బీరవెల్లి, పార్యామూర్, తాండ్ర, వైకుంఠపూర్, వంజర్, మలక్‌చించోలి, ధని, గోపాల్‌పేట్, చించోలి(బి) గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది ప్రారంభించారు. ఐకేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని, దళారులకు అమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, శుభాష్‌రెడ్డి, పోతారెడ్డి, ప్రశాంత్, మండల ప్రత్యేకాధికారి బాలిక్‌అహ్మద్‌తో పాటు ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు



భైంసాలో వీరశైవ లింగాయత్ సంఘం శోభాయాత్ర

భైంసా, మే 2 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో శుక్రవారం బసవేశ్వరుని జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇక్కడి వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో ఉదయం ప్రారంభమైన జయంతి వేడుకలు సాయంత్రం వేళ వరకు కొనసాగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బసవేశ్వరుని చిత్రపటాన్ని శోభయమానంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా శోభయాత్ర నిర్వహించారు.ఇందులో వీరశైవ లింగాయత్ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొని బసవేశ్వరుని గేయాలు ఆలపిస్తూ, నృత్యాలు చేస్తూ శోభయాత్రకు వన్నె తెచ్చారు. శోభయాత్ర ముగిసిన అనంతరం బసవేశ్వరునికి ప్రత్యేక పూజలు చేపట్టారు.సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

యువతికి సెల్‌ఫోన్ అప్పగింత



యువతికిసెల్‌ఫోన్ అందచేస్తున్న భైంసా పోలీసులు

భైంసా, మే 2 (ఆంధ్రజ్యోతి): షాపింగ్ హడవిడిలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న యువతికి సాంకేతిక పరిజ్ఞానంతో సంబంధిత సెల్‌ఫోన్‌ను గుర్తించి అప్పగించినట్లుగా భైంసా టౌన్ సీఐ గోపినాథ్ తెలిపారు. సీఐ గోపినాథ్ తెలిపిన వివరాల ప్రకారం కుభీర్ మండలంలోని డొడర్న గ్రామానికి చెందిన రాథోడ్ రోనిక అనే యువతి శుక్రవారం భైంసాకు షాపింగ్ కోసం వచ్చింది. ఈ సందర్భంలో సంబంధిత యువతి తన సెల్‌ఫోన్ ఇక్కడి మార్కెట్ ఏరియాలో పొగొట్టుకుంది. దీంతో సెల్‌ఫోన్ కోసం ఎంత వెతికిన దొరకకపోవడంతో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. ఇందుకు స్పందించిన పట్టణ పోలీసులు ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ద్వారా పోయిన సెల్‌ఫోన్ గుర్తించి పట్టుకున్నారు.అనంతరం బాధిత యువతికి సంబంధిత సెల్‌ఫోన్‌ను అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థినుల దుర్మరణం

- వేగంగా రోడ్డుపై కెనాల్ బ్రిడ్జిని ఢీ కొట్టిన కారు
- నిజామాబాద్ జిల్లా అర్గుల్ 44వ జాతీయ రహదారిపై ఘటన
- మృతి చెందిన విద్యార్థినులు నిర్మల్ జిల్లాకు చెందిన అక్కాచెల్లెళ్లు
- అతి వేగం, కారు డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం



1 .నిజామాబాద్ జిల్లా అర్గుల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు
2.రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బనవత్ మంజుల 3. బనవత్ అశ్విని మృతదేహం

జక్రాన్‌పల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ పరీక్ష రాసి కారులో తిరిగి వస్తుండగా.. అతి వేగంతో కారు అదుపు తప్పి కెనాల్ బ్రిడ్జిని ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన అక్కచెల్లెళ్లు మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ జిల్లా పెంబి మండలం లోతర్య తండాకు చెందిన బనవత్ అశ్విని (20), బనవత్ మంజులా (17) హైదరాబాద్‌కు ఎప్‌సెట్ పరీక్ష రాసేందుకు తెల్లవారుజామున కారులో బయలుదేరారు. ఎప్‌సెట్ పరీక్ష రాసిన అనంతరం హైదరాబాద్ నుంచి కారులో స్వగ్రామానికి తిరిగి బయలు దేరారు. మార్గ మధ్యలో నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామ మైత్రి గార్డెన్ వద్ద కారు అతివేగంతో కెనాల్ బ్రిడ్జిని ఢీకొట్టింది. ఈ ఘటనలో బనవత్ అశ్విని, బనవత్ మంజుల అక్కడికక్కడే మృతి చెందగా.. కారు డ్రైవర్ హంసరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. కాగా.. అశ్విని డిగ్రీ చదువుతుండగా, బనవత్ మంజుల ఇంటర్ చదువుతోంది. మంజుల ఎప్‌సెట్ పరీక్ష రాసేందుకు హైదరాబాద్‌కు వెళ్లగా.. ఈమెకు తోడుగా అక్క అశ్విని కారులో వెంట వెళ్లింది. అయితే అతి వేగం, కారు డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జక్రాన్‌పల్లి ఎస్సై మాలిక్ రహ్మాన్ తెలిపారు.

కార్టలైజర్ ప్రోగ్రాంతో విద్యార్థులకు విద్య

● పాఠశాల చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్

నిర్మల్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : వశిష్ట పాఠశాలలో కార్టలైజర్ ప్రోగ్రాంతో విద్యార్థులకు ఉత్తమ విద్య, సమగ్ర అభివృద్ధి అందించడమే లక్ష్యమని పాఠశాల చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు రోబోటిక్స్ ద్వారా విద్యార్థులు రోబోట్లను ఎలా తయారు చేయాలి. ప్రోగ్రాం ఎలా చేయాలి. విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరియం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

నిర్మల్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల రాంనగర్ విద్యార్థినులు మొదటిసారి ఆంగ్ల మధ్యమంలో మంచి ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుకారాం తెలిపారు. 37 మంది విద్యార్థులకు గాను 36 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. నిఖిత 554, సుజాత 553, అలాగే 9 మంది విద్యార్థులకు 500 పైగా మార్కులు సాధించినట్లు తెలిపారు. మొదటిసారి ఆంగ్ల మధ్యమంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను డీడీ జాదవ్ అంబాజీ అభినందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గజ్జారాం, నాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీలో ఇంటర్ ప్రవేశాలకు
దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఎంజేపీ గురుకుల విద్యాలయాల సొసైటీ పరిధిలో జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఖానాపూర్ ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. సంతోష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎంజేపీ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మాత్రమే ఈ ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు మే 12వ తేదీ వరకు ఎంజేపీ సొసైటీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదవ తరగతి వరకు ఎంజేపీలో చదివిన విద్యార్థులు నేరుఆ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్. తెలంగాణ.జీవోవీ.ఇన్‌లో సందర్శించాలని లేదా 9154102667 అనే నెంబర్‌పై ఎంజేపీ ఖానాపూర్ ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో గాని నేరుగా కళాశాలకు వచ్చి గాని సంప్రదించాలని సూచించారు.

ఇంటింటా ఆధ్యాపకుల ప్రచారం

కుబీర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుబీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పదోతరగతి పాస్ అయిన విద్యార్థుల వద్దకు వెళ్లి తమ కళాశాలలో చేరాలని సూచించారు. మండలంలోని సాంగ్వి, గొడ్సారా, చొండి, గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ కళాశాలలో ఉచిత ప్రవేశాలు, పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్, నాణ్యమైన విద్య, తదితర వాటి గురించి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు నర్సయ్య, శేఖర్, ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆధ్యాపకులు



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

కులగణనపై గొప్పలు చెప్పడం సిగ్గుచేటు

● ఎంపీ గోడం నగేష్

ఆదిలాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అస్తవ్యస్థంగా, తప్పుల తడకగా కులగణనను చేపట్టిన కాంగ్రెస్‌కు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుండాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కులగణనపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం పట్ల మోదీ చిత్రపటానికి ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ దేశ ప్రజల జనగణన, కులగణను చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ దేశ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం కచ్చితమైన కులగణనను నిర్వహించేందుకు సిద్ధమైందన్నారు. ఇందులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, వేదవ్యాస్, జోగురవి, భూమేష్, రాకేష్, సుభాష్, దయాకర్, తదితరులున్నారు.

భీంపూర్: మండలంలోని అర్లి(టి)లో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు అంకం అశోక్ నాయకులతో కలిసి ప్రధాని మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అంకం అశోక్ మాట్లాడుతూ బీజేపీ కేంద్ర ప్రభుత్వం కుల గణనకు ఆమోదం తెలపడం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పండరి, దత్తు, దేవన్న, బేరు, తదితరులు ఉన్నారు.

'కుల గణన కాంగ్రెస్ ఆలోచన విధానమే'

బోథ్, మే 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కుల గణన కోసం తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ పార్టీ ఆలోచన విధానం అని కాంగ్రెస్ చేసిన డిమాండ్ వల్ల ఈ రోజు కేంద్రంలో కుల గణనకు శ్రీకారం చుట్టిందని మార్కెట్ కమిటీ చైర్మన్ బి.గంగారెడ్డి, మాజీ చైర్మన్ జి.రాజు యాదవ్‌లు పేర్కొన్నారు. శుక్రవారం కుల గణన కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తాము స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంటి, సహకార సంఘం డైరెక్టర్ ఉమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకులు వి.సురేందర్, రైతు నాయకు లు గడ్డల నారాయణ, మహ్మద్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సెలవులను సద్వినియోగం చేసుకోండి

నేరడిగొండ, మే 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కుమారి గ్రామంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. అర్హులైన రెండవ తరగతి నుంచి పదవ తరగతి చదివే విద్యార్థులందరూ సమ్మర్ క్యాంప్‌లో కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానిక ఈ క్యాంప్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందంతో పాటు సీఆర్‌పీ, ఎస్ఎంఎస్ చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ సోల్జర్‌కు ఘన స్వాగతం

ఉట్నూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దుల్లో సీఆర్‌పీఎఫ్ ఎస్ఐగా సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన మండలంలోని ఏంది గ్రామానికి చెందిన రాథోడ్ కాశీనాథ్‌కు ఉట్నూర్ ప్రజలు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. గత నెల చివర ఉద్యోగ విరమణ పొంది ఉట్నూర్‌కు చేరుకోవడంతో మహిళలు బంజారా నృత్యాలు చేస్తూ, హారతులు పట్టి స్వాగతం పలకగా.. బంధువులు, స్నేహితులు పూలమాలతో స్వాగతం పలికారు.

నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా.. ఎస్పీతో కలిసి పరీక్ష కేంద్రాల తనిఖీ



సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 4న జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు లచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో 7 కేంద్రాలలో నిర్వహిస్తున్న నీట్ పరీక్ష సందర్భంగా పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎస్పీతో కలిసి పరిశీలించారు. నీట్ పరీక్ష 4వ తేదీన మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు ఐడీ కార్డు, అడ్మిట్‌కార్డు (హాల్ టికెట్) 2 ఫోటోలు తమ వెంట తీసుకు రావాలన్నారు. జిల్లాలో 1659 మంది పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థులకు అనుగుణంగా మొత్తం 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అనుమతించడం జరుగుతుందన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ప్రశ్న పత్రాలు, పరీక్ష సామాగ్రిని పకడ్బందీగా పోలీసు బందోబస్తు మధ్య తరలింపు, పరీక్ష కేంద్రాలలో తాగునీరు, ఏఎన్ఎం బృందాలను అందుబాటులో ఉండాలని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆయా కేంద్రాల సెంటర్ సూపరింటెండెంట్లు, కేంద్రీయ విద్యాలయ కో ఆర్డినేటర్ అశోక్, డిప్యూటీ కో ఆర్డినేషన్ విశాఖ వాఘ్మారే, ఎంఈవో, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే భావి భారత నిర్మాతలు

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్, మే 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు భావిభారత నిర్మాతలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలోని ఐటీడీఏ బీఎడ్ కళాశాలలో రెండేళ్ల బీఎడ్ పూర్తి చేసుకున్న ఛాత్రోపాధ్యాయులు వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తునే గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రజల సమస్యల పరిష్కారానికి కూడా ప్రజలకు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. పని చేసే ప్రదేశంలో స్థానికంగా ఉఉండే ఉపాధ్యాయులకు గ్రామస్థుల ద్వారా మంచి గుర్తింపు లభిస్తుంది అన్నారు. ప్రస్తుత సమాజంలో ఉపాధ్యాయులు స్థానికంగా ఉండకుండా దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తూ తమ విలువైన సమయాన్ని వృధా చేయకుంటున్నారని అన్నారు. ఐటీడీఏ ద్వారా ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న ఛాత్రోపాధ్యాయులందరు ప్రభుత్వం ప్రకటించనున్న టెట్ పరీక్షల్లో ఉత్తీర్ణులై, డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించేలా కష్టపడాలన్నారు. ప్రిన్సిపాల్ ఎం.మనోహర్, మాణిక్‌రావు, డీవీ రావు, దూట మహేందర్, లింగంపల్లి చంద్రయ్య, తిరుపతి, తదితరులున్నారు.

అలాగే, మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ 39 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాంప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ అమృత్‌లాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యుం, ఆర్‌టీఏ జిల్లా సభ్యులు దూట రాజేశ్వర్, కొత్తపల్లి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆ తర్వాత, మండల కేంద్రంలోని సేవాదాస్‌నగర్ కాలనీకి చెందిన పోలీసు హెడ్ కానిస్టేబుల్ గాయక్వాడ్ దాదారావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్ శుక్రవారం ఆయనను పరామర్శించారు.

సీఎం సహాయ నిధి పేదలకు ఒక వరం

నేరడిగొండ, మే 2(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం తన నివాసంలో సోనాల మండలంలోని సాకేర గ్రామానికి చెందిన రాథోడ్ సంగీత 10,500, రాథోడ్ కైలాష్ రూ.24 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరు అయిన రూ.34,500ల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. ఇందులో వివిధ మండలాల కార్యకర్తలు, అభిమానులు, తదితరులు ఉన్నారు.

వృద్ధుల పట్ల సేవా భావం కలిగి ఉండాలి

● అసిస్టెంట్ కమాండెడ్ రఘునాథ్‌చౌహాన్

తలమడుగు, మే 2(ఆంధ్రజ్యోతి): వృద్ధుల పట్ల ప్రతీఒక్కరు సేవా భావం కలిగి ఉండాలని తెలంగాణ స్పెషల్ పోలీస్ బ్రాంచ్ బెటాలియన్ యాపాల్‌గూడ అసిస్టెంట్ కమాండెడ్ రఘునాథ్ చౌహాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాయిలింగి వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వయోవృద్ధుల పట్ల, అనాధ వృద్ధుల పట్ల సేవా భావం కలిగి ఉండాలన్నారు. కాగా, సాయిలింగి వృద్ధాశ్రమానికి తెలంగాణ స్పెషల్ పోలీస్ బ్రాంచ్ యాపాలగూడ కమాండెడ్ నిఖిత పంత్ సహకారంతో సాయిలింగి వృద్ధులకు రూ.60 వేల విలువ గల నిత్యావసర వస్తువులు, సరుకులు, కూలర్లు, ఇతర వస్తు సామగ్రిని అందజేశారు. ఇందులో వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు దెబ్బడి అశోక్, అసిస్టెంట్ కమాండెడ్ ప్రకాష్, నారాయణ, ఆర్ఐ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు పాడిపంటలతో చల్లంగా ఉండాలి

జైనథ్, మే 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలు పాడిపంటలతో చల్లంగా ఉండాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ వేడుకున్నారు. మండలంలోని కరంజి గ్రామంలో నూతనంగా నిర్మించిన మైసమ్మ ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్.కరుణాకర్‌రెడ్డి, తదితరులున్నారు. అలాగే, కరంజిలో నిర్మించిన మైసమ్మ ఆలయంలో నాయకులతో కలిసి మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మాజీ మంత్రి జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ ఎం.గోవర్ధన్, నాయకులు, తదితరులు ఉన్నారు.

'రైతులకు నష్టం కలుగజేస్తున్న వ్యాపారులు'

ఇంద్రవెల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రైవేట్ వ్యాపారస్తులు రైతుల దగ్గర నుంచి క్వింటాల్‌కు రూ.2,200 ం నుంచి 2,500 వరకు జొన్నలను కొనుగోలు చేస్తూ రైతులకి ఒక్కొక్క క్వింటాలు వెనుకాల రూ.800 నుంచి రూ.వెయ్యి రూపాయల వరకు నష్టం చేస్తున్నా సందర్భాలు ఉన్నాయని రైతుల స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగేపు బొర్రన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో ఆయన మాట్లాడుతూ ఎలాంటి లైసెన్స్ లేకుండానే కొనుగోలు చేస్తున్నా వారిపై కఠిన చర్యలు తీసుకోవాల అన్నారు.

పరీక్షలు చేయరు.. ఫలితాలు ఇవ్వరు!

(5వ పేజీ తరువాయి...)

చేసుకుంటున్నారు. అవగాహన లేని రైతులు మాత్రం భూ సామర్థ్యానికి విరుద్ధంగా పంటలను సాగు చేస్తూ విచ్చలవిడిగా ఎరువుల వాడకంతో నష్టపోతున్నారు. జిల్లాల వారీగా భూసార పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రతిపాదనలను సిద్ధం చేసిన ప్రభుత్వం పట్టించుకున్నట్లే కనిపించడం లేదు. గతంలోనే మూడు జిల్లాలకు సంబంధించిన మార్కెట్ చైర్మన్లతో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమావేశమై ఈ విషయంపై చర్చించారు. కొత్తగా ఏర్పడిన నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల మార్కెట్ కార్యాలయాలతో పాటు జిల్లాలోని ఇంద్రవెల్లి మండలంలో మరో భూసార పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ నిర్మల్ జిల్లా కేంద్రంలోనే తాత్కాలికంగా భూ సార పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసి మిగితా జిల్లాలను వదిలేశారు.

చనిపోతున్న కోళ్లు.. ఇబ్బందుల్లో మహిళలు

ఉట్నూర్, మే 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి కోళ్ల ఫారంలో పెంచుతున్న కోళ్లు వేసవి ఎండలకు చనిపోతుండడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆదివాసీ గిరిజన మహిళలు పేర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా చిన్నపిల్లలు తెచ్చి కోళ్లు పెద్దవిగా చేస్తుండగా వాటి దాణ కోసం వేళ రూపాయలు ఖర్చు అవుతుండగా మార్కెటింగ్ సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో గత వారం రోజులుగా 60 కోళ్లు మృత్యువాత పడ్డాయని పౌల్ట్రీ నిర్వాహకురాలు పోశవ్వ తెలిపారు. ఇందిరా మహిళ శక్తి కోళ్ల ఫారంలను ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ఆదాయం అందిస్తామని అధికారులు తెలపడంతో పౌల్ట్రీ వ్యాపారంలో నిలదొక్కుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రాథోడ్ రవీందర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించాలని కోరామన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన 250 క్వింటాళ్ల జొన్నల పట్టివేత

ఇచ్చోడ, మే 2(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో షేక్ సజ్జద్ పశువులపాకలో అక్రమంగా నిల్వ ఉంచిన 500 బస్తాల జొన్నలు 250 క్వింటాళ్ల జొన్నలు పట్టుబడ్డాయి. పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు మాదాపూర్ గ్రామశివారులో అక్రమంగా నిల్వ ఉంచిన జొన్న సంచులను సీజ్ చేసి పంచానామా నిర్వహించినట్లు ఎస్సై తిరుపతి, రెవెన్యూ ఆర్ఐ హుస్సేన్, వ్యవసాయాధికారి రమేష్‌లు పేర్కొన్నారు. పక్క రాష్ట్రాల నుంచి అక్రమంగా రాష్ట్రానికి జొన్నలు వస్తున్నాయని.. దళారులు ఆ జొన్నలను తక్కువ ధరకు తీసుకొని ఎక్కువ మొత్తంలో సొమ్ము చేసుకుంటూ అక్రమ దందాలకు పాల్పడుతున్నారని రైతులు పేర్కొంటూన్నారు. జొన్నలు విక్రయించే రైతుల పొలాల్లో సర్వే నిర్వహించి పండించిన పంట వివరాలు.. జొన్నల క్వింటాళ్ల వివరాలు సరిగ్గా ఉన్నాయో? లేవోనని? చూసి కొనుగోలు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

జొన్నలేప తిని 20 పశువుల మృత్యువాత

ఇచ్చోడ(బజార్‌హత్నూర్)/ బోథ్, మే 2(ఆంధ్రజ్యోతి): జొన్న పంట లేప తిని 20 ఆవులు మృతి చెందగా.. మరో 20 ఆవులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న సంఘటన శుక్రవారం బజార్‌హత్నూర్ మండలంలో చోటు చేసుకుంది. రెవెన్యూ, పశువైద్య సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుర్కపల్లి గ్రామంలో జొన్న పంట లేప తిని 20 ఆవులు మృతి చెందాయి. మరో 20 ఆవులకు పశువైద్యాధికారి పర్వేజ్‌అహ్మద్ చికిత్సను అందిస్తున్నారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ.. రైతులు జొన్న పంట కోసిన వెంటనే పంటను కాల్చివేయాలని, అలాగే వదిలేయకూడదని ఆయన పేర్కొన్నారు. అలాగే వదిలేయడంతో వర్షాలు పడి చిగురించిన లేపను పశువులు తింటే పెనుప్రమాదం అన్నారు. 13 మంది పాడి రెతులకు చెందిన పశువులు మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. చనిపోయిన ఆవుల విలువ సుమారు రూ. 4 లక్షలకు పైగా ఉంటుందన్నారు. ఈ మేరకు రెవెన్యూ ఆర్ఐ పంచానామా నిర్వహించారు.

మహారాష్ట్ర నుంచి తెచ్చి అక్రమంగా జొన్నలు విక్రయిస్తున్న వారిని అడ్డుకోవాలి



జొన్న బస్తాలతో మహారాష్ట్ర నుంచి వచ్చిన వాహనం

కుభీర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జొన్నల కొనుగోలు కేంద్రంలో మహారాష్ట్ర నుంచి తరలించి జొన్నలను అక్రమంగా విక్రయిస్తున్న వారిని అడ్డుకోవాలని మాజీ ఏఎంసీ చైర్మన్ కందూర్ సంతోష్ అన్నారు. ఏఎంసీ కార్యాలయ ఆవరణలో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ఈ సరుకు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ చేసిన రైతులకు డబ్బు అందించి వారి పట్టాపాసుపుస్తకంపై విక్రయిస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర నుంచి జొన్నలు క్వింటాలుకు రూ. 2వేలు చెల్లించి ఇక్కడి కేంద్రంలో 3371 రూపాయలకు విక్రయిస్తున్నారన్నారు. జిల్లా అధికారులు స్పందించి సరిహద్దు మహారాష్ట్ర బార్డర్‌లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అడ్డుకోవాలని పేర్కొన్నారు.

బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడిగా రావుల రాము



భైంసా, మే 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసా పట్టణ బీజేపీ అధ్యక్షునిగా రావుల రాము నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం శుక్రవారం సంబంధిత నియామకపు ఉత్తర్వులను వెలువరించింది. హిందూవాహినిలో వివిధ బాధ్యతలు నిర్వర్తించిన రావుల రాము గత సంవత్సరం ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీ సభ్యత్వాల సేకరణతోపాటు రాష్ట్ర, జిల్లా శాఖలు ఆదేశించిన పలు కార్యక్రమాలు విజయవంతం చేసినందుకు గాను, బీజేపీ పటిష్ఠతకు అవిరళంగా కృషి చేస్తున్నందుకు గాను అధిష్ఠానం పట్టణ కమిటీ అధ్యక్ష పదవిని కట్టబెట్టినట్లుగా తెలిసింది. పార్టీ భైంసా పట్టణ కమిటీగా నియమితులైన రావుల రాముకు బీజేపీ శ్రేణులతోపాటు వివిధ వర్గాలు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించాయి. ఇది వరకు పట్టణ కమిటీ అధ్యక్షునిగానున్న ఎనుపోతుల మల్లేశ్వర్‌కు జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమించారు.

నిర్మల్ జిల్లాలో 7వ తేదీ వరకు విద్యుత్ వారోత్సవాలు

నిర్మల్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : 7 తేదీ వరకు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నామని సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.సుదర్శనం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్ ప్రమాదాల నివారణకు పెద్దపీట వేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు, ముఖ్యంగా రైతులకు అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని తెలిపారు. అందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, కరపత్రాలు పంచుతూ చైతన్యం కల్పిస్తున్నామని వివరించారు. జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా సర్కిల్‌లోని డీఈ టెక్నికల్ అధికారులను సేఫ్టీ అధికారులుగా నియమించి విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని, రైతులు, వినియోగదారులు ఎట్టి పరిస్థితుల్లో సంస్థ చేయవలసిన విద్యుత్ పనులు సొంతగా చేయకూడదని తెలిపారు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదని, గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని కోరుతున్నామన్నారు. రైతుల సమస్యలను విని వారి సమస్యలను పరిష్కరించడానికి 'విద్యుత్ అధికారుల పొలం బాట' కార్యక్రమాన్ని కూడా చేపడుతున్నామని ఈ కార్యక్రమం మంచి సత్ఫలితాలు ఇస్తుందని చెప్పారు. ఇందులో వంగిన పోల్స్, లూజ్ లైన్లు, మధ్య స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రమాదాల భద్రత విధానాలతో ఉద్యోగులకు తగు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ, సిబ్బందికి అన్ని రకాల భద్రత పరికరాలు అనగా హెల్మెట్, గ్లౌజులు, పోర్టబుల్ ఎర్తింగ్, షార్ట్ సర్క్యూట్ కిట్లు, సేఫ్టీ షూస్, ఇన్సులేటెడ్ టూల్స్, వోల్టేజ్ డిటెక్టర్ మొదలైనవి అందజేస్తూ వారికి నియమిత కాల వ్యవధిలో సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి ఫీల్డ్ సిబ్బంది నుండి సీనియర్ అధికారుల వరకు ఉద్యోగులందరి సమిష్టి కృషి అవసరమని, ప్రమాదాలను సమర్థవంతంగా తగ్గించడానికి అన్ని అంశాలలో భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, నిరంతర శిక్షణ, భద్రత పద్ధతులను బలోపేతం చేయడం వలన భద్రత ప్రమాణాలను పెంచగలుగుతున్నామని తెలిపారు. ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తినా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రైతులకు సుస్థిర వ్యవసాయ విధానాలపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్



భూసార పరీక్ష చేసే విధానాన్ని చూపిస్తున్న నిర్వాహకులు

సోన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : విశ్వ ఆగ్రోటెక్ సౌజన్యంతో పసుపు, మొక్కజొన్న పంటలో సేంద్రియ ఎరువుల వినియోగం, రైతుల సుస్థిర వ్యవసాయ విధానాలపై మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ మాట్లాడుతూ... భూసార పరీక్షలు ప్రతి రైతు విధిగా చేసుకొని సిఫార్సు చేసిన రసాయన ఎరువులు మాత్రమే వాడాలని అలాగే రసాయన ఎరువుల వినియోగం తగ్గిస్తూ సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని, మంచి నాణ్యమైన పంట దిగుబడులు పొందాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఆమోదించిన ఎరువుల కంపెనీల ఎరువులు మాత్రమే వాడాలన్నారు. ప్రతి రైతు విధిగా బిల్లు అడిగి మరి తీసుకోవాలన్నారు. గ్రామాల్లోకి అనుమతి లేని సేంద్రియ ఎరువుల పేరుతో రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. వాటి పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం భూసార పరీక్ష నిర్వాహకురాలు షహనాజ్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కేవలం 5 నమిషాల్లో భూసార పరీక్ష చేసే విధాదాన్ని చేసి చూపించారు. డీఏవో, ఏడీఏ పరీక్షన విధానాన్ని పరిశీలించారు. వారి వెంట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు విద్యాసాగర్, మండల వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, ఏఈవో అశోక్ కుమార్, సీఈవో సుభాష్, మేనేజర్ కృష్ణ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ కుల గణన నిర్ణయం చారిత్రాత్మకం

దిలావర్‌పూర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : జనగణనలో భాగంగా కుల గణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకమని మండల బీజేపీ అధ్యక్షుడు అయిండ్ల భీమ్‌రెడ్డి అన్నారు. దిలావర్‌పూర్‌లో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధానిమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాభిప్రాయం మేరకు సామాజిక సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని జనగణనలో భాగంగా కులగణన చేయాలని నిర్ణయించడం గొప్ప నిర్ణయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జంగం వీరేష్ కుమార్ మాట్లాడుతూ... కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కులగణన పేరుతో స్వార్థపూరిత రాజకీయాలకు తెరలేపాయన్నారు. దీన్నే రాజకీయ అస్త్రంగా వాడుకుని... ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేందుకు ప్రయత్నించాయన్నారు. కానీ ప్రజాప్రయోజనాలను కాపాడే విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీసరి శైలేశ్వర్, తక్కల నర్సారెడ్డి, నిరంజన్ రెడ్డి, ఫాక్స్ డైరెక్టర్ రాజలింగం, ఉదిరిగి సాయి, శ్రావణ్‌రెడ్డి, నల్ల నరేష్ రెడ్డి, టి.నవీన్, రవి, రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

నర్సాపూర్(జి), మే 2 (ఆంధ్రజ్యోతి) : కుల గణన సర్వే చేపట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని బీజేపీ మండల అధ్యక్షులు బర్కుంట నరేందర్ అన్నారు. ప్రతీ 10 సంవత్సరాలకు ఒకసారి చేసే జన గణన కరోనా కారణంగా 2021లో జరగలేదు. కానీ 1950 తర్వాత మొట్ట మొదటిసారి బీజేపీ ప్రభుత్వం కేంద్ర క్యాబినెట్ కుల గణన చేయాలని ప్రతిష్ఠాత్మక నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉదయం నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

నేడు మూడు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఖానాపూర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : నేడు (శనివారం) ఖానాపూర్, పెంబి, కడెం మూడు మండలాల పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఖానాపూర్ ఏఈ రాంసింగ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్ పట్టణంలోని గాంధీనగర్ వద్ద అమృత్ 2 స్కీంలో భాగంగా వాటర్‌ట్యాంక్ నిర్మాణం చేస్తున్న నేపథ్యంలో 33 కేవీ ఫీడర్ లైన్‌షిఫ్టింగ్, చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్‌లైన్ల మరమ్మతులను నిర్వహిస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు. ఈ మరమ్మతుల పనుల నేపథ్యంలో పెంబి మండలంలోని అన్ని గ్రామాలకు ఖానాపూర్ మండలంలోని బీర్నంది, సత్తెనపల్లి, పాత ఎల్లాపూర్, కడెం మండలంలోని లింగాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో వచ్చే గ్రామాలన్నింటికీ విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. పై మరమ్మతు పనులు నిర్వహిస్తుననందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయన పేర్కొన్న గ్రామాలన్నింటిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి మూడు మండలాల ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

30 పడకల ఆసుపత్రిలో

సెలైన్ బాటిల్‌స్టాండ్‌ల కొరత



సెలైన్ బాటిల్ స్టాండ్ కొరతతో కిటికీకి బాటిల్ పెట్టిన దృశ్యం

నర్సాపూర్(జి), మే 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ 30 పడకల ఆసుపత్రిలో సెలైన్ బాటిల్ స్టాండ్‌ల కొరతతో ఆసుపత్రికి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్టాండ్‌లను సమకూరిస్తే సమస్య తీరుతుందని మండల వాసులు అంటున్నారు.

కంప్యూటర్ సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), మే 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపల్లిలో పీఎం యోజన పథకం కింద మంజూరైన రూ.14.5 లక్షలతో అత్యాధునిక కంప్యూటర్ సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి శుక్రవారం స్థానిక నాయకులు భూమిపూజ చేశారు. ఈ నిర్మాణంతో పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్న మహేష్, కాంట్రాక్టర్ వినోద్‌రెడ్డి, బాశెట్టి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ క్యాంపస్ ముందు ఆటో దగ్ధం



దగ్ధమైన ఆటో

బాసర, మే 2 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ వద్ద బాసర - భైంసా రహదారిపై శుక్రవారం ఆటోలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది.భైంసా వైపు వెళ్తున్న ఆటోలో ఆకస్మాత్తుగా మంటలు ఏర్పడ్డాయి. క్షణలో అంతా వ్యాపించి ఆటో మొత్తం కాలిపోయింది. ప్రయాణికులు ఎవరు లేకపోవడం డ్రైవర్ అప్రమత్తతతో ముప్పు తప్పింది. ఎండ తీవ్రత వల్లనే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

టాక్లిలో దొంగల అలజడి



సీసీ కెమెరాకు చిక్కిన దొంగ

బాసర, మే 2 (ఆంధ్రజ్యోతి) :మహారాష్ట్ర సరిహద్దులో గల బాసర మండలం టాక్లి గ్రామంలో గురువారం రాత్రి దొంగలు అలజడి సృష్టించారు.గిరిజన వాడలోని దవనే గంగాధర్ ఇంట్లో చొరబడి అందినకాడికి నగదు,వస్తువులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. అదే విధంగా కొట్ బాబురావు ఇంట్లో చోరికి యత్నించినట్లు అక్కడే ఉన్న సీసీ కెమెరాలో రికార్డయింది.స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన





వాడి, కోతుల్‌గాం గ్రామాల మధ్య కూలిపోయిన వంతెన ఇదే..

వంతెన కష్టాలు తీరేదెన్నడో?

● వాడి గ్రామస్థులకు తప్పని ఇబ్బందులు ● పట్టించుకోని పాలకులు, అధికారులు

భైంసా రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : భైంసా మండలంలోని బబుల్‌గాం గ్రామానికి వంతెన లేక ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. వాడి నుంచి కోతుల్‌గాం రావడానికి, మహగాం నుంచి చింతల్‌బోరి రావడానికి ప్రజలకు చాలా ఇబ్బందులకు పడుతున్నారు. వాడి గ్రామంలో 200 జనాభా ఉంది. ప్రతీ పనికి కోతుల్‌గాం గ్రామానికి రావాల్సి వస్తోంది. ఈ రెండు గ్రామాల మధ్య 2017 సంవత్సరంలో పల్సికర్ రంగారావు ప్రాజెక్టు నిర్మించారు. భారీ వర్షాలు కురవడం వలన వంతెన కూలిపోవడం జరిగింది. ప్రజలు అధికారులకు ఈ సమస్య గురించి ఎన్నోసార్లు విన్నవించారు. అధికారులు కూలిపోయిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మిస్తామని హామీలు ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు నూతన వంతెన నిర్మించలేదు. ఎక్కడి హామీలు అక్కడే ఉన్నాయి.

అత్యవసర పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు

వాడి గ్రామస్థులు ఏ చిన్న పని ఉన్న 2 నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోతుల్‌గాంకు రావాల్సిందే. వంతెన కూలడంతో మహగాం, గుండేగాం, చింతల్‌బోరి మీదుగా 12 నుండి 13 కిలో మీటర్లు ప్రయాణించి కోతుల్‌గాం వెళ్లాల్సి వస్తోంది. ప్రతీనెల పింఛన్లు, రేషన్ బియ్యం, పంట పొలాలకు కచ్చితంగా వెళ్లాలి. అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. వచ్చేది వర్షాకాలం చిన్నపాటి వర్షం కురిసిన రోడ్లు బురదగా మారుతాయి. ఇప్పటికైనా అధికారులు, రాజకీయ నాయకులు వెంటనే వంతెన నిర్మించాలని వాడి గ్రామ ప్రజలు కోరుతున్నారు.





వంతెన నిర్మించాలి

● అన్వర్, కోతుల్‌గాం, రైతు

వాడి గ్రామసమీపంలో రంగారావు పల్సికర్ ప్రాజెక్టు ఉండడంతో కోతుల్‌గాంకు వాడికి మధ్య వంతెన లేక ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామ పంచాయతీ కోతుల్‌గాం కావడంతో ప్రతీ పనికి అక్కడికి వెళ్లాల్సి ఉంటుంది. అందుకే అధికారులు వంతెన త్వరగా నిర్మించాలని కోరుతున్నాం.



పింఛన్ల కోసం వెళ్లాలంటే కష్టంగా ఉంది..

● మాణిక్ రావు పటేల్, రైతు, వాడి

వచ్చేది వర్షాకాలం కాబట్టి వ్యవసాయ పనుల కోసం ప్రతీరోజు వెళ్లాలి. వర్షం కురిస్తే ఇంటి వద్దే ఉండాల్సి వస్తోంది. అదే వంతెన ఉంటే ఎప్పుడైన వ్యవసాయ పనులకు ప్రతీ రోజు వెళ్లొచ్చు. మా సమస్యను అర్థం చేసుకొని వంతెన నిర్మించాలని అధికారులను కోరుతున్నాం.



మాట్లాడుతున్న పీఓ ఖుష్బుగుప్తా

విద్యార్థులను ప్రతిభావంతులను చేసేందుకే వేసవి క్రీడాశిబిరాలు

● ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా

ఉట్నూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులను ప్రతిభావంతులుగా తయారు చేసేందుకే వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, ఉత్తమ శిక్షణలు అందిస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలతో ఉత్తమ క్రీడాకారులు వెలికి వచ్చారని అన్నారు. గిరిజన ప్రాంతాల పిల్లలకు సహజ సిద్ధంగా క్రీడల పట్ల మక్కువ ఉంటుందని వారి ఇష్టాన్ని తెలుసుకుని వారికి ఉన్న మక్కువను తెలుసుకుని ఆ క్రీడాంశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉత్తమ క్రీడాకారులైన విద్యార్థులను ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు తెచ్చారన్నారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు హాజరైన విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా తమకు ఇష్టం ఉన్న క్రీడలపై శిక్షణ పొందాలన్నారు. క్రీడా విద్యార్థులకు అవసరమన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. ఇటీవల స్కాచ్ అవార్డు పొందిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీడీ అంబాజి జాదవ్ వాలీబాల్‌క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో పీవీటీజీ ఏపీఓ మేస్రం మనోహర్, ఏసీఎంఓలు ఆత్రం జగన్, శివాజీ, జిల్లా క్రీడల అధికారులు కోరెడ్డి పార్థసారథి, భుక్యరమేష్‌నాయక్, ఫిజికల్ డైరెక్టర్లు జాదవ్‌హేమంత్‌నాయక్, సౌజన్య, రవీందర్, జాదవ్‌మధుసూదన్, క్రీడా పాఠశాల హెచ్‌ఎం జాదవ్ ఉత్తమ్, మేస్రం గంగారాం, కోచ్‌లు శివ, శేఖర్, కీర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీడీ అంబాజిజాదవ్



వాలీబాల్ క్రీడాకారులతో అధికారులు

నేటి నుంచి డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

● దోస్త్ నోటిఫికేషన్ విడుదల

● మూడు విడుతల్లో ప్రవేశాలకు అవకాశం

భైంసా,మే2 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి శుక్రవారం దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడు విడుతల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించారు. శనివారం నుంచి తొలి విడత దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది.

మొదటి విడుత

మే3 (శనివారం) నుంచి 21 వరకు మొదటి విడుత దరఖాస్తుల స్వీకరణ కొనసాగనుంది. మే 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. మే 29న మొదటి విడుత ఫేజ్ సీట్ల కేటాయింపు జరుగనుంది.

రెండో విడుత

మే 30 నుంచి జూన్ 8 వరకు రెండవ విడుత దరఖాస్తుల స్వీకరణ కొనసాగనుంది. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. జూన్ 13న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు.

మూడో విడుత

జూన్ 13నుంచి 19 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగనుంది. జూన్13 నుంచి 19 వరకు వెబ్ అప్షన్లకు అవకాశం ఉండనుంది. అనంతరం జూన్ 23న సీట్ల కేటాయింపు ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇక జూన్ 30 నుంచి డిగ్రీ కళాశాలల్లో తరగతులు ప్రారంభం కానున్నాయి.

ధర్మాజిపేటలో వైద్య శిబిరం

ఉట్నూర్, మే 2(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ధర్మాజిపేటలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వేసవి ఎండలు మండిపోతున్నందున ఉదయం సాయంత్రం మాత్రమే ప్రజలు పనుల ఓసం బయటకు వెళ్లాలన్నారు. గిరిజనులందరు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపెట్టాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా వ్యాధుల నుంచి తమను తాము కాపాడుకోగలుగుతామన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, జ్వరాలు వస్తే వెంటనే వైద్య కేంద్రానికి తరలి రావాలని కోరారు. గర్భిణీలు బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా క్షయ, సికిల్ సెల్ వ్యాధిగ్రస్థులకు పీఎంజన్‌మన్ వైద్య సిబ్బంది రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపటేల్ మడావి మాణిక్‌రావ్, దేవరి రాము, మహాజన్ కడప అయ్యు, హవాల్దార్ కొడప సోము, అంగన్‌వాడీ టీచర్ శారద, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

'పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

తలమడుగు, మే 2(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ఆయన మండలంలోని లచ్చంపూర్ గ్రామంలో పేద కుటుంబానికి చెందిన సారంగుల రమేష్ కుమార్తె దీక్షిత అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సహకారంతో ఆమెకు రూ.30 వేలు సీఎం రీలిఫ్ ఫండ్ చెక్కుని మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు సారంగుల రాజేశ్వర్, జంగు పటేల్, ఆనందరావు, వెంకన్న, యాదవీ రాకేష్, రావుల నారాయణ, తదితరులున్నారు.

'టైగర్ జోనల్ ద్వారా జన్నారం వాసులకు ఇబ్బందులు'

ఆదిలాబాద్ రూరల్, మే2 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్ జోనల్ ఆంక్షల ద్వారా జన్నారం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల అభివృద్ధి కమిటీ కన్వీనర్ కొండయ్య అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ ప్రెస్ క్లబ్ ఆయన మాట్లాడారు. జాతీయ రహదారి పరిపాలన రద్దుచేసి ఖానాపూర్ నుంచి జగిత్యాల వైపు డైవర్ట్ చేయడంతో తమ ప్రాంతానికి అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. ఈ విషయంపై ఎంపీ నగేష్ కలిసి రవాణా కష్టాలు దూరం చేయాలని కోరామన్నారు. సమావేశంలో చంద్రయ్య, సత్యం, అశోక్, శబీర్ పాషా, అక్బర్ పాషా, మేనేని శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

● ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ● పోలీసు సిబ్బందికి మెడికల్ క్యాంపు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్పీ



మెడికల్ క్యాంపులో మాట్లాడుతున్న ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, మే2 (ఆంధ్రజ్యోతి):విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉంటూ ఆరోగ్యం గురించి పోలీసులు పట్టించుకోరని వారి కోసం ప్రత్యేకంగా హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం పోలీసు హెడ్ క్వార్టర్‌లో మెడిలైఫ్ ఆసుపత్రి, రిమ్స్‌శ్రీవిష్ణు న్యూరో ఆసుపత్రి వైద్యులతో పోలీసులతోపాటు వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్పీ స్వయంగా వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది 24గంటలు విధులను నిర్వర్తిస్తూ ఆరోగ్యం పై నిర్లక్ష్యం వహిస్తారని, ఆరోగ్యం పట్ల ఎటువంటి అశ్రద్ధ వహించకుండా ఉండాలన్నారు. కాగా కార్డియాలజీ, గైనకాలజీ, పీడియాట్రిషన్, ఆర్థోపెడిక్ విభాగాలలో పోలీసులతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఆయా వైద్య నిపుణులు పరీక్షించి మందులను అందించారు. మెడికల్ క్యాంపు నిర్వహించినందుకు జిల్లా ఎస్పీకి పోలీసు అసోసియేషన్ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు టి.మురళి, సిబ్బంది ఉన్నారు.

పెన్షన్ పక్కదారి!

● ఒకే కుటుంబంలో భార్యాభర్తకు మంజూరు

● బడా వ్యాపారులు, ఉద్యోగులు, మృతులకూ అందుతున్న వైనం



పెన్షన్ లబ్ధిదారుల జాబితా

నార్నూర్, మే2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేద, వృద్ధులకు అందిస్తున్న పెన్షన్లు ప్రభుత్వ అధికారులు ఇష్టారాజ్యంతో పక్కదారి పడుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఆర్థికంగా బాగా ఉన్న వ్యాపారస్తులకు సైతం పెన్షన్ మంజూరు చేయడం విస్మయానికి గురిచేస్తోంది. ప్రభుత్వ ఖజానాకు గండిపడినా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిసున్నారు. గ్రామ స్థాయిలో ఎంతమందికి పెన్షన్ వస్తోంది.. ఎవరు అర్హులు.. ఎవరు పెన్షన్ పొందుతూ ఎవరు చనిపోయారు.. మంజూరు అయిన పెన్షన్‌లలో ఏమైనా లోపాలు ఉన్నాయా కోణం అధికారుల దర్యాప్తు మాత్రం ఎక్కడా కనపడటం లేదు. మండల కేంద్రం వద్ద ప్రజలు పెద్దఎత్తున్న పెన్షన్ టెన్షన్ అటెన్షన్. చర్చలు చేసుకుంటున్నారు. నార్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో 312పైగా మందికి పెన్షన్లు వస్తున్నాయి. ఒకే కుటుంబంలో భార్యతోపాటు భర్త కూడా పెన్షన్ అందుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. బడావ్యారులు, ఉద్యోగులు సైతం పెన్షన్ అందుకోవడం చర్చనీయాంశంగామారుతోంది. దీంతోపాటే చనిపోయిన వారి పేర్లపై కూడా గుట్టుగా అధికారులు పెన్షన్ అందిస్తున్నట్లు చర్చలు సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మౌనంగా ఉండడంతో అనేక అనుమానాలకు తావిస్తోంది.

కలెక్టర్ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి

● అర్క, గోవింద్ కార్యదర్శి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నార్నూర్



పింఛన్ల మంజూరుపై అనేక అవకతవకలు జరుగుతున్నాయి. ఏజెన్సీ గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా అధికారుల పని తీరుపై అనేక అనుమానాలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ గారు ప్రత్యేకంగా విచారణ జరిపించి అసలైన లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నాం.

పింఛన్ల విషయంపై చర్యలు చేపడతాం

● గంగాసింగ్, సూపరింటెండెంట్, నార్నూర్



పింఛన్ల మంజూరు, పంపిణీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం. పింఛన్లలో అక్రమాలు జరిగితే వారిపై చట్టపరమైన విచారణ జరిపించి చర్యలు తీసుకుంటాం. నార్నూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శికు పింఛన్లపై వస్తున్న ఆరోపణలపై దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశాం.

మూల మలుపులు.. మృత్యు పిలుపులు!

● ప్రమాదకరంగా బోల్స సమీపంలోని మూలమలుపులు ● పట్టించుకోని సంబంధిత అధికారులు

జర దేఖో!!



బోల్స గ్రామసమీపంలోని మూలమలుపు

తానూర్, మే2: గ్రామాల్లోని మూల మలుపులు మృత్యు పిలుపులుగా మారాయి. దీంతో ప్రయాణికులు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మూల మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. మండలంలోని బెల్‌తరోడ నుంచి తానూర్‌కుల వెళ్లే రహదారి ప్రమాదకరంగా ఉన్న ఒక్క హెచ్చరిక బోర్డు కనిపించడం లేదు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో రాంటెక్ గ్రామానికి చెందిన సాయినాథ్ అనే యువకుడు బోల్సా సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. మండలంలోని కర్భాలా, దౌలతాబాద్, వడ్‌గాం, హంగిర్గా, బామ్ని, బోరిగాం సమీపంలో గల బాలాజీ గుట్ట, సింగన్‌గావ్ మార్గాల్లో మూల మలుపులు ప్రమాద కరంగా ఉన్నాయి. హంగీర్గ గ్రామం సమీపంలో ఏడాది క్రితం మూల మలుపు వద్ద ట్రాక్టర్‌కు ఢీకొని ఒక వ్యక్తి మరణించాడు. మరో ఘటనలో బోరిగాం సమీపంలోగల బాలాజీగుట్ట వద్ద మహారాష్ట్రలోని నాంద గ్రామానికి చెందిన 7గురు ఆటోలో దౌలతాబాద్‌లో నిర్వహించే సప్తహా కార్యక్రమానికి వెళ్తూఆటో బోల్తా పడి ఒకరు మృతిచెందగా పలువురు గాయపడ్డారు. మరో ఘటనలో బోల్స గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద తానూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు, ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఉపాధ్యాయులు తీవ్రగయాలపాలైన సందర్భాలున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మండలంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద సూచికబోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి: పోతన్నయాదవ్, బోల్స గ్రామం



మూలమలుపుల వద్ద చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాల బారిన పడుతున్నారు. స్పీడు బ్రేకర్లు ఏర్పాట్లు చేసినట్లయితే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.


నివేదికలు పంపుతాం: సునీల్‌కుమార్, డీఈఈ

మండలంలోని పలు గ్రామాల్లో గల రోడ్ల మూలమలుపులు ప్రమాదకరంగా మారిన మాట వాస్తవమే. ఈ మూల మలుపుల వద్ద జరిగిన ఘటనల్లో పలువురు మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. మూలమలుపుల వద్ద స్పీడు బ్రేకర్లు, జిబ్రాక్రాస్ మార్కర్, సూచిక బోర్డుల కోసం నివేదికలను పంపించాం. నిధులు మంజూరు కాగానే ఏర్పాటు చేస్తాం.

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.8, కనిష్ఠం 27.7

ఆంధ్రజ్యోతి



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

5

శనివారం 3 మే 2025

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

నేరడిగొండ, మే 2(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు వేయించుకోవాలని మండల పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుంటాల(బి), సక్రియ నాయక్ తండా గ్రామాలలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక నివారణ టీకాలు వేశారు. ఈనెల 17 వరకు గ్రామాల వారీగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని, పశు పోషకులు ఈ అవకాశానిన సద్వినియోగం చేసుకోవాలని, తమ పశువులకు నిరోధక టీకాలు వేయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

షీటీం సేవలను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో మహిళలు, విద్యార్థులు షీటీం బృందాలను సంప్రదించాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఏప్రిల్‌లో షీటీం బృందాల ద్వారా నాలుగు ఎఫ్ఎస్ఐఆర్ కేసులు, పది ఈ పెట్టి కేసుల నమోదు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 42 హాట్ స్పాట్‌లను గుర్తించి వాటిని ప్రతీవారం ఆకస్మికంగా తనిఖీ చేస్తూ పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

● జిల్లాలో 5 వీడీసీలపై కేసులు

గ్రామ అభివృద్ధి కమిటీల అక్రమ కార్య కలాపాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. వీడీసీలు అక్రమ వసూళ్లకు, దుందాలకు, సెటిల్‌మెంట్లకు పాల్పడరాదని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్న ప్రభుత్వ యంత్రాంగాన్ని సంప్రదించాలన్నారు. బేల, జైనథ్, బోథ్, ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లలో 5 వీడీసీలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీడీసీ బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు.



ఎస్సైగా బాధ్యతలను స్వీకరిస్తున్న కె.అఖిల్

నార్నూర్ ఎస్సైగా కె.అఖిల్

నార్నూర్, మే 02 (ఆంధ్రజ్యోతి) : నార్నూర్ మండల కేంద్ర పోలీస్ స్టేషన్ ఎస్ఐగా 2024 బ్యాచ్ చెందిన కె.అఖిల్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి

● తెలంగాణ మాదిగ జేఏసీ అధ్యక్షుడు

ఆదిలాబాద్ అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో దళిత గిరిజన సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మాదిగ జేఏసీ అధ్యక్షులు మల్యాల మనోజ్ మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అభినందిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలలో ఇందిరమ్మ కమిటీలాంటి కమిటీలను వేయకుండా ఏ సంక్షేమ పథకం ప్రవేశ పెట్టిన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మండల, మున్సిపాలిటీలలో ఉన్నటువంటి ప్రత్యేక అధికారుల ద్వారానే సంక్షేమ పథకాలు అమలు చేసే విధంగా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వాక నర్సింహులు మాదిగ, ఆదివాసీ కులం సేవా సంఘం అధ్యక్షులు కడప సోనేరావు, లక్ష్మణ్, కిషన్, బాలు, గోవింద్రావు తదితరులు పాల్గొన్నారు.



గుడిహత్నూర్ పీహెచ్‌సీలో డాక్టర్ శ్యామ్‌సుందర్‌తో మాట్లాడుతున్న డాక్టర్ విశారదన్ మహరాజ్

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్

గుడిహత్నూర్, మే 2(ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ అణగారిన వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. మా భూమి రథయాత్రలో భాగంగా శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు వసతుల గురించి డాక్టర్ శ్యామ్ సుందర్‌ను అడిగి తెలుసుకున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు మెరుగైన వైద్యం అందకపోవడానికి కారణం అగ్రకుల ప్రభుత్వాలేనని ఆరోపించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. డీఎస్పీగా ఉద్యోగం సాధించిన ఎస్సై మహేందర్‌కు భారత రాజ్యాంగ పుస్తకాన్ని ఇచ్చి అభినందించారు. శంభుగూడలో ఏర్పాటు చేసిన రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర నాయకుడు అన్నెల లక్ష్మణ్, మండల అధ్యక్షుడు బడుగు రాజేశ్వర్, నాయకులు నరేష్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.



పంట చేనును చదును చేస్తున్న రైతులు

పరీక్షలు చేయరు.. ఫలితాలు ఇవ్వరు!

- ఉమ్మడి జిల్లాలో మూడు మండలాలకే పరిమితం
- భూసార పరీక్షలకు అనువైన సమయం ఇదే..
- ఖరీఫ్ ముంచుకొస్తున్నా.. అందని సాయిల్ హెల్త్ కార్డులు
- నేల సామర్థ్యాన్ని గుర్తిస్తేనే ఖరీఫ్ సాగుకు ప్రయోజనం
- జిల్లాలో భూసార పరీక్షల కోసం అన్నదాతలకు తప్పని ఎదురుచూపులు

ఆదిలాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ పంటల సాగుకు ముందు వేసవిలో భూసార పరీక్షలను నిర్వహించి.. దానను గుణంగానే పంటల సాగు, అవసరమైన ఎరువుల వాడకానికి అవకాశం ఉంటుంది. కానీ వ్యవసాయ శాఖ పంటల సాగును లాభసాటిగా మార్చేందుకు చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు. గత రెండు, మూడేళ్లుగా భూసార పరీక్షలకు స్వస్తి చెప్పి ఫలితాలను వెల్లడించక పోవడంతో పంటల సాగు విధానం గాడి తప్పుతోంది. 2015లో కేంద్ర ప్రభుత్వం సాయిల్ హెల్త్ కార్డు పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ప్రతీ రైతుకు భూసార పరీక్షల ఫలితాలను అందించే విధంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. అయినా సకాలంలో భూసార పరీక్షల ఫలితాలు రైతుల దరికి చేరడం లేదు. అలాగే ప్రభుత్వం గతంలోనే మరో అడుగు ముందుకేసి మట్టి నమునాల సేకరణకు తపాల శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఇప్పటి వరకు సరైన విధివిధానాలు ఖరారు కాకపోవడంతో ఈ విధానం అములులో తీవ్ర జాప్యం జరుగుతూ వస్తోంది. ఈ యేడు ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆదిలాబాద్ (నార్నూర్), ఆసిఫాబాద్ (తిర్యాని), మంచిర్యాల (బెజ్జూర్) జిల్లాల లోని మూడు మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి మట్టి నమునాలను సేకరించారు. ఖరీఫ్ సమయం దగ్గర పడుతున్నా.. ఇప్పటి వరకు సంబంధిత రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేయలేదు. జిల్లాలో మే మాసం చివరిలోనే పంటల సాగుకు రైతులు శ్రీకారం చుడుతారు. కానీ ఇప్పటి వరకు ఫలితాలను వెల్లడించక పోవడంతో అన్నదాతలు అయోమయ పరిస్థితికి గురవుతున్నారు. భూసార పరీక్షల ఫలితాల కోసం అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు.



సమయం మించి పోతోంది..

భూసార పరీక్షలకు సమయం మించి పోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట భూముల్లో భూసార పరీక్షలను నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరుతున్నా.. పట్టించుకోవడం లేదంటున్నారు. రైతులే మట్టి నమునాలను సేకరించి భూసార పరీక్ష కేంద్రానికి నేరుగా తీసుకొస్తేనే పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. అయితే భూసార పరీక్షల కోసం గతంలోనే మొబైల్ వ్యాన్‌ను కొనుగోలు చేసిన మరమ్మతులు చేపట్టక పోవడంతో మూలనే పడి ఉంటుంది. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా వృధాగానే మారింది. ప్రభుత్వం భూసార పరీక్షలపై దృష్టి సారించక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. విచ్చలవిడిగా రసాయాన మందుల వాడకంతో భూసారం దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. గతంలో భూసార పరీక్షల కోసం వర్షాధార భూముల్లో 25 ఎకరాలకు ఒక మట్టి నమునా, అలాగే నీటి ఆధారిత భూముల్లో 6.25 ఎకరాలకు 500 గ్రాముల మట్టి నమునాలను రైతుల సమక్షంలో సేకరించి పరీక్షలు చేసే వారు. అయితే ఈ విధానంతో సరైన ఫలితాలు రావడం లేదని భావించిన గత ప్రభుత్వం ప్రతీ రైతు పంట చేను నుంచి మట్టి నమునాలను సేకరించాలని నిర్ణయించింది. కానీ అమలుకు మాత్రం నోచుకోక పోవడంతో మూన్నాళ్ల ముచ్చటగానే మారింది.

అంతా ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే..

: రాంకిషన్, ఏడీఏ, భూసార పరీక్ష కేంద్రం, ఆదిలాబాద్

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల్ జిల్లాలలో మూడు మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నార్నూర్, బెజ్జూర్, తిర్యాణి మండలాల నుంచి మట్టి నమునాలను సేకరించాం. దానాధారంగానే పరీక్షలు నిర్వహించి సాయిల్‌హెల్త్‌కార్డులను జారీ చేస్తాం. ఈ నెలాఖరి వరకు కార్డులను అందజేస్తాం. గతంలో మాదిరిగా క్షేత్ర స్థాయిలోకి వెళ్లి మట్టి నమునాలను సేకరించడం లేదు. అవసరమైన రైతులు మట్టి నమునాలను తీసుకొస్తే పరీక్షలు నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తాం.

టార్గెట్ 12 వేలకే పరిమితం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఒకే పరీక్ష కేంద్రం ఉండడం ఇబ్బందికరంగా మారిందంటున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోనే భూసార పరీక్షల కేంద్రం అందుబాటులో ఉంది. ఇక్కడి నుంచే కొత్తగా ఏర్పడిన ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల నుంచి సేకరించిన మట్టి నమునాలను జిల్లా కేంద్రానికి తరలించాల్సి ఉంటుంది. దీంతో దూర భారం పెరిగి పోవడంతో పరీక్ష ఫలితాలను అందించేందుకు రైతులకు కొన్ని ఇబ్బందులు తలెత్తడంతో సాయిల్ హెల్త్ కార్డుల జారీలో ఆలస్యం జరుగుతోంది. ఈ యేడు జిల్లాలో ఎంపిక చేసిన నార్నూర్ మండలం నుంచి 3554 నమునాలు, మంచిర్యాల జిల్లాలోని బెజ్జూర్ మండలం నుంచి 4106, కొమరంభీం జిల్లా తిర్యాని మండలం నుంచి 4800.. మొత్తం 12,460 మట్టి నమునాలను సేకరించారు. ఇప్పటి వరకు 11 వేల మట్టి నమునాల పరీక్షలు నిర్వహించి ఫలితాలను ఆన్‌లైన్ చేశారు. లక్షల్లో మట్టి నమునాలను సేకరించాల్సి ఉండగా.. కేవలం 12 వేలకే పరిమితం చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే సాయిల్ హెల్త్ కార్డు జారీలోనూ జాప్యం జరుగుతూ వస్తోంది. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను ఎప్పుడు జారీ చేస్తారో? అధికారులకే తెలియని పరిస్థితి కనిపిస్తోంది.

ప్రతిపాదనలపై పట్టింపేది?

జిల్లా కేంద్రంలో ఉన్న భూసార పరీక్ష కేంద్రం సామర్థ్యం 5 వేలు కావడంతో మూడు మండలాలకే భూసార పరీక్షలను పరిమితం చేశారు. మిగితా మండలాల్లో భూసార పరీక్షలను నిర్వహించేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొంత మంది రైతులు ప్రైవేట్‌లో డబ్బులు ఖర్చు చేసి భూసార పరీక్షలను

(తరువాయి 6వ పేజీలో...)

భూభారతి పకడ్బందీగా అమలు చేయాలి

● రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ● జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ● పాల్గొన్న జిల్లా అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, మే2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతి చట్టం క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావుతో కలిసి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఏప్రిల్ 17నుంచి 30 తేదీ వరకు రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈనెల 5 నుంచి 20 వరకు 28 జిల్లాలోని 28 మండలాల్లో పైలెట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ల నేతృత్వంలో ప్రతీ మండలానికి రెండు బృందాలను నియమించాలని, ప్రతీ బృందంలో తహసీల్దార్, సర్వేయర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ బృందాలు నిర్దేశిత గ్రామంలోనే ఉంటూ భూ సమస్యలపై ప్రజలు, రైతుల నుంచి అర్జీలు స్వీకరించాలన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను ఈనెల 31 వరకు పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్ని లిఖితపూర్వకంగా తెలుపుతు దరఖాస్తులను తిరస్కరించాలని సూచించారు. ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, అసైన్డ్ ల్యాండ్‌లకు సంబంధించి పోజిషన్ మీద ఉండి పట్టా లేని వారు, పట్టా ఉండి పోజిషన్ మీద లేని వారి వివరాలను సేకరించాలని సూచించారు. కబ్జాలకు, అన్యాక్రాంతానికి గురైన ప్రభుత్వ భూములను సైతం గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకుని పక్కాగా వాటి వివరాలను రికార్డులలోపొందుపర్చాలని ఆదేశించారు. భూభారతి నూతన చట్టంపై రాష్ట్రంలో 605 మండలాలకు గాను ఇప్పటి వరకు 590 మండలాల్లో అవగాహన సదస్సులను నిర్వహించామని, 85527 మంది పౌరులు, 162577 మంది రైతులు అవగాహన సదస్సులలో పాల్గొన్నారని మంత్రి వివరించారు. ఇదిలా ఉండగా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఒక్కో నియోజక వర్గానికి కేటాయించిన 3500 ఇళ్లకు లబిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి నియోజక వర్గంలోని పట్టణ ప్రాంతంలో కనీసం 500 ఇళ్లను కేటాయించి లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు. అనర్హులని తేలితే ఇండ్ల నిర్మాణం మధ్యలో ఉన్న కూడా రద్దు చేస్తామన్నారు. లబ్దిదారుల చెక్ లిస్టును మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తమ అధీనంలో జాగ్రత్తగా భద్రపర్చాలని అన్నారు. ఇందులో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బుగుప్తా, ట్రైని కలెక్టర్ సలోని, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అడిషనల్ ఎస్పీ సురేందర్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులు



మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా



హాజరైన గిరిజనులు

హస్తకళల్లో రాణిస్తున్న గిరిజనులకు చేయూత

● ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

ఉట్నూర్, మే 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని హస్త కళల ద్వారా ఇత్తడి బొమ్మలు తయారు చేసే గిరిజనులకు ఐటీడీఏ ద్వారా చేయూత అందిస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్‌సీ భవనంలో ఐటీడీఏ, వీక్కి ఫ్లో లేడిస్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలోని ఊషేగం జనగాం, కిస్లగూడ, చింతల్‌బోరి, రాంపూర్, బండగూడ ప్రాంతాలలో 80 గిరిజన కుటుంబాలు ఇత్తడి బొమ్మలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాయన్నారు. గిరిజనులు తయారు చేసిన ఇత్తడి బొమ్మల ప్రదర్శన పరిశీలించారు. సంస్థ ద్వారా 200 ఇత్తడి బొమ్మలు కొనుగోలు చేయడానికి గిరిజనులకు ఆర్డర్ ఇచ్చారు. గిరిజనులకు బొమ్మల మార్కెటింగ్, డిజైన్స్ గురించి వివరించారు. సంస్థ చైర్‌పర్సన్ ప్రతిభ, టీమ్ మెంబర్స్ కవితా రెడ్డి, దీప్తి, శీతల్, వైటీసీ జేడీఎం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులను వదిలితే కేసులు

● ఇచ్చోడ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో పశువుల యజమానిపై కేసు నమోదు

● రోడ్లపైకి పశువులు రాకుండా పాడి చూసుకోవాలి : ఏఎస్పీ కాజల్ సింగ్



ఇచ్చోడ, మే 2(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని కొకస్‌మన్నూర్ క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన బస్సు, లారీ, ఆటో ప్రమాదంలో నిర్లక్ష్యంగా రోడ్లపై పశువులను వదిలిన యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ పేర్కొన్నారు. పశువులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యజమానుల పట్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశువులు వాహన ప్రమాదాలకు కారణమవుతూ.. ఆస్తి నష్టం కలిగించడంతో పాటు ట్రాఫిక్‌ను అడ్డుకుంటాయని, ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తాయన్నారు. గురువారం జరిగిన ప్రమాదంలో పశువుల యజమాని రావుసబ్ సిందే ముక్రా(కె) గ్రావనికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. పాడి రైతులు తమ పశువులను రోడ్లపైకి రాకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయన హెచ్చరించారు.

కార్యాలయాన్ని తరలించడం : డీఎస్పీ

ఆదిలాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ కార్యాలయాన్ని తరలించడం లేదని డీఎస్పీ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పత్రికలు, సోషల్ మీడియాలో కార్యాలయాన్ని తరలిస్తున్నట్లు వస్తున్న వార్త కథనాలను ఎవరూనమ్మవద్దన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ జిల్లా ప్రజల సౌకర్యార్థం కొంతమంది సిబ్బందితో ఏసీబీ కార్యాలయం సీ-2 క్వాటర్‌ను సీసీ నస్పూర్ మంచిర్యాల జిల్లాలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు ఉండవన్నారు. జిల్లా కేంద్రంలో కూడా ఏసీబీ అధికారి, ఇతర సిబ్బంది అందుబాటులో ఉంటారని యధావిధిగా ఏసీబీ కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు. ఎలాంటి అపోహలను నమ్మవద్దన్నారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దీని కోసం గాను టోల్ ఫ్రీ నెం. 1064ను సంప్రదించాలని కోరారు. అలాగే ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ 9154388963, ఏసీబీ ఇన్స్‌పెక్టర్ ఎన్. కిరణ్‌రెడ్డి 9154388964, ఏసీబీ ఇన్స్‌పెక్టర్ స్వామి 9154388965కి సంప్రదించాలని డీఎస్పీ విజయ్ కుమార్ ఈ సందర్భంగా సూచించారు.

గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా ప్రదర్శన

బోథ్, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాను మండలంలోని 20 గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నోటీసు బోర్డులపై ఇందిరమ్మ ఇళ్ల జాబితాలను అతికించారు. దీంతో గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అర్హులు కదా అనే విషయం గ్రామస్తుల ముందు ఉంటుందని ప్రభుత్వం భావించి ప్రదర్శన చేయాలని ఆదేశాలు వచ్చాయి. అయితే జాబితాలో అనర్హుల పేర్లు ఉంటే గ్రామ పంచాయితీ కార్యదర్శి లేదా ఎంపీడీవో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా రెండు రోజులలో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. అనేక గ్రామాల్లో ఇందిరమ్మ కింద జాబితాలో అర్హత లేని వారి పేర్లు రావడంతో పాటు రాజకీయ జోక్యంతో లబ్ధిదారులుగా ఎంపిక అయ్యారని విమర్శలు వస్తున్నాయి. ఏదిఏమైనా వందల్లో దరఖాస్తులు ఉంటే పదుల సంఖ్యలో మంజూరు కావడం వల్ల గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు రాజకీయ దుమారం లేపనుంది.



దన్నూర్ పంచాయతీలో జాబితాను ప్రదర్శిస్తున్న గ్రామ కార్యదర్శి



నిరసన తెలుపుతున్న పెసా కమిటీ, బీజేపీ నాయకులు

ఏజెన్సీ చట్టాల ప్రకారం ఇళ్లు మంజూరు చేయాలి : పెసా కమిటీ కోఆర్డినేటర్

నార్నూర్, మే 2(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గిరిజన ప్రాంత చట్టాలైన 1/70, పెసా యాక్ట్, 5వ షెడ్యూల్డ్ ఏరియా చట్టాలను గత కొద్దీనెలకే పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం అమలు తెచ్చినప్పుడు.. ఇక్కడి గిరిజనులకు అన్యాయం చేసే విధంగా కొంత మంది చట్టాలకు విరుద్ధంగా ఇందిరమ్మ కమిటీ పేరుతో ఇష్టం ఉన్నట్లుగా ఇళ్లు మంజూరు చేయడం పట్ల శుక్రవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందర పెసా కమిటీ కోఆర్డినేటర్ సికెందర్ రాథోడ్ నిరసన కార్యక్రమం చేపట్టారు. వీరికి బీజేపీ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామసభలను ఏర్పాటు చేయాలని, ఇల్లు లేని వారికే ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు అధికంగా కేటాయించాలన్నారు. కానీ విరుద్ధంగా కమిటీ సభ్యులు ఇష్టారీతిన ఇల్లు మంజూరు చేయడం ఏంటని ప్రశ్నించారు. అధికారులు గ్రామసభ పెట్టకుండా ఇళ్లు మంజూరుచేస్తే.. పెసా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బీజేపీ మండల అధ్యక్షుడు బిక్కు రాథోడ్, చలుకర్ ప్రకాష్, శంకర్ మహరాజ్, హన్మంతు, సిరంగ్ పాల్గొన్నారు.